## క్లుప్తంగా

### అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



**చెన్నారావుపేట :** 'మన ఊరు–మన బడి' అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ ఉంద్రాతి సుజన్‌తేజ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో సోమవారం పాఠశాల అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల చివరి వరకు పనులు పూర్తి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అభివృద్ధి పనుల ఫొటోలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్, హెచ్ఎంలు, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్, సీఆర్పీలు సంపత్, బాలు, స్వామి, శిల్ప, హేమలత తదితరులు ఉన్నారు.

### పరామర్శ



**ఖానాపురం :** కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రావు తల్లి ఆగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్సంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్, ప్రముఖ వైద్యులు ఉదయ్‌సింగ్ పరామర్శించారు.

**రాయపర్తిలో..**

**రాయపర్తి :** మండలంలోని కొండూరుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎనబోతుల శ్రీనివాసరావు కుమారుడు అజయ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందగా సోమవారం ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బైండోవర్ ఉల్లంఘన

**వరంగల్(పర్వతగిరి) :** మండలంలోని మూడెత్తులతండాకు చెందిన జాటోత్ మంగమ్మ గతంలో గుడుంబా తయారీకి పాల్పడగా తహసీల్దార్ కోమి ఎదుట ఆమెను బైండోవర్ చేశారు. అయినా తన ప్రవర్తన మార్చుకోకుండా మరో సారి గుడుంబా విక్రయిస్తూ పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. దీంతో బైండోవర్ నియమాలను ఉల్లంఘించినందుకు తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగమ్మను నర్సంపేట ప్రత్యేక మహిళా జైలుకు తరలించినట్లు తెలిపారు. స్టేషన్ పరిధిలో బైండోవర్ అయిన వారు నియమాలను ఉల్లంఘిస్తే రూ.2లక్షల జరిమానా లేదా జైలు శిక్ష తప్పదని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సువర్ణ, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు బాబు, అనిల్ ఉన్నారు.

### పూజల పేరుతో మోసం

**వర్ధన్నపేట :** ఓ యువకుడి మానసికస్థితిని గ్రహించిన సైబర్ నేరస్తుడు రూ.1.15లక్షలు మోసం చేసిన సంఘటన సోమవారం మండలంలోని రామోజీకుమ్మరిగూడెంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై రామారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రామోజీకుమ్మరిగూడెం గ్రామానికి చెందిన హిట్లర్ తన సోదరుడి ఆరోగ్యం బాగాలేక ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో మీ సమస్యలకు ప్రత్యేక పూజలు చేసి పరిష్కరిస్తామని వచ్చిన ప్రకటనను చూసి నమ్మి వారికి ఫోన్ చేసి తన సోదరుడి సమస్యను వివరించాడు. కాగా మాటలతో నమ్మించి సైబర్ మోసగాడు పలు దఫాలుగా పూజలు చేస్తున్నట్లు నమ్మించాడు. మోసగాడు చెప్పినట్లు తన సోదరుడి ఆరోగ్యం ఏ మాత్రం మెరుగుపడక పోవడంతో తాను మోసపోయానని గ్రహించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఈ విషయాన్ని సైబర్ క్రైం డిపార్టమెంట్‌కు తీసుకెళ్లి వెంటనే రూ.56వేల వరకు రికవరీ చేయడం సాధ్యమైందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై రామారావు తెలిపారు.

### బాలికతో అసభ్య ప్రవర్తన

**పోక్సో కేసు నమోదు**

**వర్ధన్నపేట :** బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై బాలిక తల్లిదండ్రులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో, ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇల ఉన్నాయి.. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ కుటుంబం ఇల్లంద గ్రామంలో పరదాలు అద్దెకు ఇస్తూ తమ కూతురుతో కలిసి జీవిస్తున్నారు. సోమవారం సాయంత్రం కంగన్ హాల్‌కు వెళ్లి రోల్ గోల్డ్ చెవి కమ్మలు కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత చెవికమ్మలు నచ్చలేదని తిరిగి మార్చుకోవాలని షాపునకు బాలిక వెళ్లి చెవి కమ్మలు మార్చి ఇవ్వమని కోరింది. దీంతో ఆ కంగన్ హాలు యజమాని బాలికతో అసభ్యంగా ప్రవర్తించగా బాలిక ఏడుస్తూ వెళ్లి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నర్సంపేటరూరల్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ రజిని



దుగ్గొండి: నాచినపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**దుగ్గొండి :** రైతులు పండించిన మొక్కజొన్న, ధాన్యం చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాచినపల్లి, దుగ్గొండి, వెంకటాపురం గ్రామాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. ముఖ్యమంత్రి హోదాలో రైతు చేనులో అడుగు పెట్టిన తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ చరిత్ర సృష్టించాడన్నారు. రైతులు బాధల్లో ఉంటే వారిని పరామర్శించని ప్రతిపక్షాలు పంట పోయి 45 రోజులకు మళ్లీ పర్యటనలు చేస్తామనడం సిగ్గు చేటన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో 40 వేల ఎకరాలలో వివిధ పంటలు నష్టపోయాయని రూ.40 కోట్ల పరిహారం త్వరలోనే చెక్కుల రూపంలోగాని, ఆన్‌లైన్ రూపంలోగాని రైతులకు అందించడం జరుగుతుందన్నారు. విపత్తు వచ్చినప్పుడు సాయం అందించాల్సిన కేంద్రం స్పందించక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానా నుంచి పంట పరిహారం అందిస్తుందని గుర్తు చేశారు. సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మోటార్లు ఇస్తుంటే కేంద్ర ప్రభుత్వం మోటార్లకు మీటర్లు పెట్టే పనిలో ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, సొసైటీ చైర్మన్లు సుకినె రాజేశ్వర్‌రావు, ఊరటి మహిపాల్‌రెడ్డి, బట్టు పైడి, వైస్ ఎంపీపీ పల్లాటి జైపాల్‌రెడ్డి, కాట్ల భద్రయ్య, శానబోయిన రాజుకుమార్, మేర్గు రాంబాబు, శంకేషి కమలాకర్, తిరుపతిరెడ్డి, సాగర్, మదు, జంగ రాజిరెడ్డి, నాగరబోయిన మోహన్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**నర్సంపేట రూరల్ :** నర్సంపేట మండలంలోని రాజుపేట పరిధిలో గల కమలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజనీకిషన్, రెండోవార్డు కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భరత్, దండిగ రమేష్, డైరెక్టర్ సతేంద్ర రాజు, శ్రీనివాస్, పోతరాజు బాబు, ప్రశాంత్, రజనీకాంత్, వీరస్వామి, సోమేష్, తిరుపతిరెడ్డి, వీరన్న, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర**

**సంగెం :** రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ కళావతి అన్నారు. సోమవారం మండలంలోని ఆశాలపల్లిలో రుద్రమదేవి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యం తీసుకుని రావాలన్నారు. సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్‌యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ పసునూరి సారంగపాణి, ఎంపీటీసీ సుతారి బాలకృష్ణ, ఏఓ యాకయ్య, ఏఈఓ గీత, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రావు, రైతులు పాల్గొన్నారు.



సంగెం: ఆశాలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి తదితరులు

**కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి**



చెన్నారావుపేటలో..

**చెన్నారావుపేట :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని జోజిపేట నారాయణ తండాలో సోమవారం జై దుర్గా భవాని ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, సర్పంచ్ అంద్ర విజయరాణి బాలజోజి, ఏఓ సూర్యనారాయణ, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు భూక్యా రవీందర్, ఏఈఓ స్మిత, రఘు, రైతులు బాలు నాయక్, బోడ ప్రవీన్, దేవ్‌సింగ్, నర్సు, వెంకన్న తదితరులు ఉన్నారు.

### సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**వరంగల్ (పర్వతగిరి) :** హైదరాబాద్ సరూర్ నగర్‌లో జరిగే ప్రియాంకగాంధీ యువ సంఘర్షణ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నర్సంపేట మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### కరపత్రాల ఆవిష్కరణ



**నల్లబెల్లి :** మండల కేంద్రంలో రేపు(బుధవారం) నిర్వహించనున్న హనుమాన్ భక్తుల నగర సంకీర్తన (శోభయాత్ర)లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గురుస్వామి కొత్తపల్లి రాంనర్సయ్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శోభాయాత్ర అనంతరం మహాన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమన్ మాలధారులు తడుక వినయ్, విజయ్, ప్రవీణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ గ్రంథాలు పంపిణీ చేయాలి



వర్ధన్నపేట: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



దుగ్గొండిలో..

**వర్ధన్నపేట :** దేశ ప్రజలందరికి భారత రాజ్యాంగ గ్రంథాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు బర్ల నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వర్ధన్నపేట నాయబ్ తహసీల్దార్ వినయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల ప్రశాంత్, కంజర్ల రంజిత్‌కుమార్, తూల్ల హరీష్, కలకోటి కల్యాణ్, రమేష్, సురేష్, అనిల్, వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**దుగ్గొండిలో..**

**దుగ్గొండి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ గ్రంథాలను ప్రజలకు ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి, మండల అధ్యక్షుడు జన్ను కళ్యాణ్, నాయకులు మల్లికార్జున్, ఐత వంశీ, చిలువేరు దేవా, అరూరి విజయ్, సుమన్, మంచాల సురేష్, సుమన్, రాజేష్, ప్రభు, రఘు పాల్గొన్నారు.

**రాయపర్తిలో..**

**రాయపర్తి :** దేశపౌరులందరికీ రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని దళితశక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) మండల అధ్యక్షుడు గారె వెంకటస్వామి కోరారు. సోమవారం మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపు మేరకు తహసీల్దార్ కుసుమ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు మల్లేష్, బూడిద అశోక్, కందుకూరి మధు, కందుకూరి మనోజ్, ఎల్లయ్య, పూల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బ్రహ్మోత్సవాలు



**ఖానాపురం :** మండలంలోని బుధరావుపేటలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే పెద్ది సహకారంతో ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో రూ.35లక్షలతో నిర్మించిన మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

### శేషవాహనంపై వేంకటేశ్వరుడు..

**దుగ్గొండి :** మండలంలోని కేశవాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహోత్సవాలు సోమవారం రెండోరోజుకు చేరాయి. కార్యక్రమంలో యాగశాలలో మహా హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శేషవాహనంపై గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఈఓ కిరణ్, కంది జితేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సర్పంచ్ రేవూరి నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీ మోటార్ల అందజేత



మోటార్లు అందజేస్తున్న సోమయ్య

**నెక్కొండ :** పంటల సాగుకు కోసం రైతులకు సబ్సిడీపై విద్యుత్ మోటార్లను అందిస్తున్నామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య అన్నారు. నెక్కొండ మార్కెట్ ఆవరణలో సోమవారం 90 మంది రైతులకు సీఎంఆర్ సబ్సిడీ మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులు సబ్సిడీ విద్యుత్ మోటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం రాజిరెడ్డి, మాదాసు రవి, మాసం వెంకన్న, ఐలయ్య, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కంటి పరీక్షలు చేయించుకోవాలి



చెన్నారావుపేట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



దుగ్గొండి: చాపలబండలో..

**చెన్నారావుపేట :** కంటి వెలుగు శిబిరంలో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ బాదావత్ రజిత వీరన్న, డాక్టర్ సరోజ అన్నారు. ఈ మేరకు మండలంలోని కాల్‌నాయక్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కంటి చూపు ప్రతి ఒక్కరికి ముఖ్యమైందన్నారు. అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, శివ, స్టాలిన్, ఉప సర్పంచ్ బానోత్ రాజేందర్, వార్డు సభ్యులు బానోత్ బిక్కు, లావుడ్య తిరుపతి, వనిత, రవి, ఆశ వర్కర్ గుగులోత్ వనిత ఉన్నారు.

**చాపలబండలో..**

**దుగ్గొండి :** మండలంలోని చాపలబండ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక ఎంపీటీసీ పిండి కుమారస్వామి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. డాక్టర్ కిరణ్‌రాజు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'కాంటాలు ఎందుకు చేయడం లేదు'



వర్ధన్నపేట: మక్కలను పరిశీలిస్తున్న నాయకులు

**వర్ధన్నపేట :** మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మూడు రోజులైనా ఇంకా కాంటాలు మొదలు పెట్టకపోవడం ఏంటని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని ఇల్లంద మార్కెట్‌లోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని నాయకులు సోమిడి శ్రీనివాస్, ఓదెల రాజయ్య, ఎండీ ఇస్మాయిల్ సందర్శించి రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. మొక్కజొన్నలకు టోకెన్లు, వడ్ల రైతులకు తక్ పట్టీలు ఇవ్వరన్నారు. తూకాలు ఎందుకు చేయడం లేదని సొసైటీ సభ్యులను ప్రశ్నిస్తే రైతులకు వ్యవసాయ అధికారులు టోకెన్లు ఇవ్వలేదని, వ్యవసాయాధికారులను అడిగితే అదంతా సొసైటీ వారే చూసుకుంటారని ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారు. రైతులు మూడు రోజుల క్రితం మార్కెట్‌కు మక్కలు తీసుకువస్తే తేమ శాతం ఎక్కువగా ఉందని సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే టోకెన్లు ఇచ్చి కాంటాలు వేసి రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు.

**గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి**

**రాయపర్తి :** అకాల వర్షాలతో తడిసి మొలకెత్తిన ధాన్యానికి గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు చేయాలని టీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దయ్యిందన్నారు. గిట్టుబాటు ధరను కల్పించకుంటే రైతులను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరుపాక శ్రీనివాస్, ఆకులపల్లి చేరాలు, ఎరుపుల వెంకటసాయిలు, వంగాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి కోసం.. సాగునీరు ఖాళీ చేయాలా?

- వృథాగా పోతున్న సాగునీరు
- ఆందోళనలో అన్నదాతలు
- స్పందించని సంబంధిత శాఖ అధికారులు



నిండుగా ఉన్న ఎల్లమ్మ చెరువు

**వర్ధన్నపేట :** మండలంలోని ఉప్పరపల్లి ఎల్లమ్మ చెరువులోంచి రెండు రోజులుగా సాగునీరు వృథాగా పోతున్నా గ్రామ పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ కార్యాలయం నుంచి జారీ అయిన ఉత్తర్వులు గ్రామ పంచాయతీకి అందజేసి సంబంధిత మట్టి కాంట్రాక్టర్‌తో కుమ్ముక్కై చెరువులోంచి నీటిని వదిలేస్తున్నారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సోమవారం జిల్లా ఇరిగేషన్ ఈఈ అంజనేయులు సాక్షి ఫోన్‌లో వివరణ కోరగా ఆయన స్పందిస్తూ తాము చెరువులోంచి నీరు బయటకు పంపాలని ఆదేశాలు ఇవ్వలేదన్నారు. మంగళవారం ఉదయమే తమ అధికారులను గ్రామానికి పంపించి నీరు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులోంచి నీరు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### నీటిని వదలడం అన్యాయం



వరి సాగుకు కావాల్సిన నీరు ఎల్లమ్మ చెరువులో సమృద్ధిగా ఉంది. వర్షాకాలం కచ్చితంగా వరి పంట పండుతుంది. ముందస్తుగా నార్లు పోసుకుని పంట వేద్దామని ఆశ పడితే.. చెరువులోంచి నీరును బయటకు పంపించడం అన్యాయం.

-శంకర్, ఉప్పరపల్లి

### నీటి వృథాను ఆపాలి



కేవలం నల్లమట్టి కోసం పంటకు పనికి వచ్చే నీటిని వదిలి రైతులకు అన్యాయం చేయడం దురదృష్టకరం. మట్టి విలువైందా.. నీరు విలువైందా అని వారికే తెలియాలి. నీటిని వృథా చేయడం బాధాకరం అధికారులు స్పందించి నీటిని ఆపాలి.

- మహేష్, ఉప్పరపల్లి

## పోటీలను విజయవంతం చేయాలి



క్రీడాపోటీలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ

**సంగెం :** గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించడంతో పాటుగా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి నిర్వహిస్తున్న సీఎం కప్–2023 పోటీల్లో యువత పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కళావతి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కమిటి సభ్యులతో సీఎం కప్–2023 పోటీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్, కబడ్డి, ఖో–ఖో, వాలీబాల్, జిల్లా స్థాయిలో బాల్ బాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్ విభాగాల్లో పాల్గొనే ఆసక్తి గల 15నుంచి 36 ఏళ్ల యువతీ, యువకులు ఈ నెల 11వ తేదీలోగా తమ తమ గ్రామ కార్యదర్శి వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారుల పేర్లను జిల్లాస్థాయి పంపించబడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎంపీఓ కొమురయ్య, వైద్యాధికారి అశోక్, ఎంఈఓ విజయ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి

**దామెర :** దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. దళిత బంధు లబ్ధిదారుల నుంచి రూ.మూడు లక్షలు తీసుకున్న ఎమ్మెల్యేలు ఉన్నారని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి తెలిపిన విషయం గుర్తు చేశారు. వెంటనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి అనర్హత వేటు వేయాలని అన్నారు. లబ్ధిదారుల నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని వెల్లడించారు. దళితబంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల ప్రమేయం ఉండకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 10న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట పరిమళపాల్, పాముల సుబ్బన్న, గోవిందు కిరణ్, బొర్ర జయపాల్ తదితరులు ఉన్నారు.

## 'సఖి' సేవలపై అవగాహన

**ఐనవోలు :** సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని లీగల్ అడ్వకేట్ శోభారాణి, సఖి సోషల్ కౌన్సిలర్ నిర్మలాదేవి సూచించారు. మండలంలోని పంథిని గ్రామంలో సఖి కేంద్రం, సేవలపై సోమవారం మహిళలకు అవగాహన కల్పించారు. శోభారాణి మాట్లాడుతూ.. మహిళలు, బాలికల హక్కులను, రక్షణ చట్టాల గురించి వివరించారు. పోక్సో యాక్ట్, బాల్య వివాహ నిషేధిత చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి సెంటర్‌లో బాధిత మహిళలకు లభించే సేవల గురించి వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి సెంటర్‌లో కౌన్సిలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి, పోలీస్, న్యాయ సహాయం బాధిత మహిళలకు ఉచితంగా అందించబడుతాయన్నారు. అత్యవసర పరిస్థితిలో మహిళా హెల్ప్‌లైన్ 181, 1098, డయల్–100, 0870–2935014లకు ఫోన్‌చేయాలని, సత్వరమే సహాయం అందుతుందని చెప్పారు. సఖి కేంద్రం 24 గంటలు పనిచేస్తుందని, బాధిత మహిళలు ఏ సమయంలోనైనా సఖి కేంద్రాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు.